స్మరిస్తేనే పద్యం.

శృతి చేస్తేనే వాద్యం.

నైవేద్యమిస్తేనే హృదయం.

నేనొస్తూంటే నీ నరాల్లో అలజడి వుండదు. నేను నడిచివస్తూన్న రహదారుల పక్కన అందమైన గడ్డిపూలు వూగవు. విషాదమేమిటంటే గుబులు కూడా వుండదు. 'ఇది నా విషాదమని' చెప్పుకోవటానికి కారణం కూడా వుండదు. అదీ విషాదం.

"నువ్వు ఏ విషయంలో తీరికలేకుండా వున్నావో చెబితే, నువ్వు ఎలాంటివాడివో చెపుతా"నన్నాట్ట ఒక వేదాంతి.

నీకు తీరికలేకుండా పోవటానికి నేను కారణం అయ్యుంటే ఎంత బావుండేది!

ప్రేమంటే....శృతి మించినప్పుడూ, శుష్కించినప్పుడూ ఒకేలా వుండేది.

## 4

ప్రహసిత్ మెట్లు దిగి క్రిందికి వచ్చాడు. అతడి కోసం క్రింద బెంజ్ వెయిట్ చేస్తోంది.

రణధీర్ పంపిన కారు అది. రణధీర్ జమీందారీ వంశానికి చెందినవాడు. పెద్ద పెద్ద నగరాల్లో అతడికి ఇండస్ట్రీస్ వున్నాయి. రాజకీయాల్లో కూడా పేరుంది.

రణధీర్ కూతురు మలయపవని. ఆ అమ్మాయి సిమ్లాలో చదువుతోంది. ప్రహసిత్ అంటే ప్రాణం. టెన్నిస్ అంటే ప్రాణం. అయితే మిగతా అభిమానుల్లాగా అతనితో డైరెక్టుగా పరిచయం పెంచుకోకుండా, అతనంటే తనకున్న ఇష్టాన్ని తండ్రికి చెప్పింది. రాజు తల్చుకుంటే ఇక కొదవేముంది. ప్రహసిత్ గురించి ఎంక్వయిరీ చేయించాడు.

ప్రహసిత్‌కి తల్లిదండ్రులు లేరు. డాక్టరు. బాగా డబ్బుంది. ఏ దుర్గుణాలూ లేవు. అంతకన్నా కావల్సింది ఏముంది? ఇవన్నీ చూసి, తనతో ఆర్థికస్థాయితో సరితూగలేకపోయినా, అతడిని అల్లుడిగా చేసుకుందామని తానే స్వయంగా వచ్చి కలుసుకున్నాడు.

ప్రహసిత్‌కి కూడా 'నో' అనటానికి కారణం ఏదీ కనిపించలేదు. మలయపవని చక్కటి అమ్మాయి. ఒక టెన్నిస్ పోటీలో తనని మామూలుగా కలిసింది. రణధీర్ మాటల ద్వారా ఆ అమ్మాయి బాగా వీణ వాయిస్తుందనీ, ఇంగ్లీషు లిటరేచర్ అంటే చాలా ఇష్టమని తెలిసింది. ఒక రకంగా చెప్పాలంటే ఆ అమ్మాయిని చేసుకోవటం ప్రహసిత్‌దే అదృష్టం.

ఈ సాయంత్రం పెళ్ళిచూపులు.

అంటే అది డిక్షనరీ అర్థం వచ్చే మాట కాదు. ఆ రోజు కేవలం ఆ డేవిస్‌కప్ మ్యాచ్ చూడటానికే మలయపవని ఆ వూరొచ్చింది. ఆమె తల్లిదండ్రులు ఆమెతో కూడా వచ్చారు. పవని తల్లి ఆ విధంగా ప్రహసిత్‌ని ఒకసారి చూడాలనుకుంది.

రణధీర్‌కి ఆ వూళ్ళో గెస్ట్‌హవుస్ వుంది. ప్రహసిత్ కోసం కారు పంపాడు. ప్రహసిత్ ఇప్పుడు వెళ్తున్నది అక్కడికే.

ఈ రోజు డేవిస్‌కప్ మ్యాచ్ ప్రహసిత్ గెలవటం రణధీర్‌కి సంతోషంగా వుంది. ఓడిపోయిన మూడ్‌లో ఈ పెళ్ళిచూపులు జరిగివుంటే అంత బావుండేది కాదు.

ప్రహసిత్‌ని భార్యకి పరిచయం చేశాడు రణధీర్. మలయపవని కూడా వచ్చి కూర్చుంది. టీ తాగి, కొంచెంసేపు మాట్లాడుకున్నాక "వాళ్ళు మాట్లాడుకుంటార్లే, మనం అలా ఈవెనింగ్ వాక్‌కి వెళ్ళొద్దాం పద" అని భార్యని బయల్దేరతీశాడు.

ప్రహసిత్, పవని మిగిలారు. కొంచెంసేపు మౌనంగా వున్నాక మలయ పవని నవ్వుతూ అంది... "మిమ్మల్ని చూస్తే ఎవరూ ఒక డాక్టరనీ, ప్రముఖ టెన్నిస్ ప్లేయర్ అనీ అనుకోరు".

"ఎందుకని?"

“ఇంత నిశ్శబ్దంగా వుంటే...”

ఆ మాటలకి ప్రహసిత్ మాట్లాడలేదు. తరువాత అన్నాడు...“నేను కాస్త ఎక్కువగానే మాట్లాడతాను, హుషారుగానే వుంటాను. అయితే ఈ రోజు చాలా ఇబ్బందికరమైన పరిస్థితిలో పడ్డాను”.

ఆమె ఆశ్చర్యంగా తలెత్తి చూసింది.

అతడు ఆమెవైపు చూసి నవ్వాడు. ఆ నవ్వులో ఒక స్నేహభావం మాత్రమే వుంది.

అతనన్నాడు “మీరు చాలా అందంగా వుంటారు. సంస్కారం వున్నట్టు కనబడుతోంది. కాబట్టి మీరు నన్ను అర్థం చేసుకోగలరు అని అనుకుంటున్నాను”.

“మీరు ఏ విషయం చెపుతున్నారు ప్రహసిత్”.

అతడామె ప్రశ్నకి సూటిగా సమాధానం చెప్పకుండా, తను అనుకున్నది చెప్పసాగాడు.

“ఇదే విషయాన్ని నిన్నటిరోజు నాకెవరయినా చెప్తే కొట్టిపడేసి వుండేవాడిని. ఎగతాళి చేసేవాడిని. కానీ ఇప్పుడు నేను అదే పరిస్థితిలో పడ్డాను. ఇదంతా మీకు చెప్తే తేలికభావం కలగొచ్చు. కానీ అర్థం చేసుకోవటానికి ప్రయత్నించండి” అని ఆగి

“ఈ రోజు ప్రొద్దున్న మ్యాచ్ జరుగుతుండగా ఒకమ్మాయిని చూశాను. ఆ అమ్మాయిని నేను ప్రేమించాను” అన్నాడు.

యధాలాపంగా వింటూన్న మలయపవని ఒక్క క్షణం ఉలిక్కిపడింది. పదహారేళ్ళ కుర్రాడు అన్నట్టుగా వున్నదామాట. ఇండియాకి ప్రాతినిధ్యం వహించే యువకుడు అన్నట్టుగా లేదు. ఒక డాక్టర్ అన్నట్టుగా లేదు. మ్యాచ్ జరుగుతూండగా అమ్మాయిని చూడటం ఏమిటి? ప్రేమించటం ఏమిటి?

“మీకు నవ్వు రావొచ్చు. ఈ అనుభవం జరగకపోయివుంటే అసలిలాంటి భావం ఒకటి కలుగుతుందని నేనే నమ్మకపోయి వుండేవాడిని. ఆ అమ్మాయిని చూడగానే ఈ అమ్మాయి నాకోసమే పుట్టింది అన్పించింది. ఐ.....ఐ..... కుడ్ నాట్ జస్ట్ ఎస్కేప్ ఇట్...”

“ ఆ అమ్మాయి పేరు?”

“తెలీదు”

ఆమె ఆశ్చర్యంగా “తెలీదా” అంది.

“లేదు. కానీ ‘విష్ యు ఆల్ ది బెస్ట్’ అంది”.

“సారీ పవనిగారూ .. పెళ్ళి చూపులవరకూ తీసుకొచ్చి ఈ విషయం చెపుతున్నందుకు. నా చర్య నా ఆలోచన... అంతా స్టుపిడ్‌గా మీకు అనిపించవచ్చు. ముక్కూ, మొహం తెలియని అమ్మాయి...ఆ  అమ్మాయి ఎవరో.. మేనరికం వుందో...ఎవరైన్నా ప్రేమించిందో ...ఏమీ తెలియకుండా...వన్‌వే ట్రాఫిక్‌లా ప్రేమించి.. అదే సాయంత్రం మీదగ్గిర పెళ్ళిచూపులకొచ్చి ఆ విషయం చెప్పటం ...... ”

“అదే ప్రేమంటే” అంది మలయపవని అతడి మాటలు మధ్యలో కట్ చేస్తూ .

అతడాశ్చర్యంగా తలెత్తాడు.

“అది ప్రేమ అనుకోవటం స్టుపిడిటీ కాదు. అనుకోకపోవటం స్టుపిడిటీ. ఒకర్ని చూస్తే అకారణంగా వాళ్ళతో స్నేహం చేయాలనిపిస్తుంది. అభిమానం కలుగుతుంది. వ్యక్తిత్వాలూ, అర్థం చేసుకోవటాలూ అవన్నీ తరువాత వచ్చేవి. గాంధీగారి భావాలు మనకు నచ్చవచ్చు. వ్యక్తిత్వం గొప్పగా కనపడవచ్చు. అందుకని ఆయన్ని వివాహమాడాలనుకోం! రొమాంటిక్ ఫీలింగ్ ...... అదీ ముఖ్యం!” అంది.

“థాంక్స్, మీరు అర్థం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఇంతవరకూ తెచ్చినందుకు మరోసారి క్షమాపణ చెప్పుకుంటున్నాను.”

“అబ్బే, అదేంలేదు. నా అభిమాన ప్లేయర్‌తో కలిసి ‘టీ’ తాగే అవకాశం లభించింది. అది చాలు. ఆ అదృష్టవంతురాలెవరో...తొందర్లో శుభలేఖ పంపండి” అంది నవ్వుతూ.

ప్రహసిత్ కూడా తేలికపడ్డ మనసుతో నవ్వాడు. “దానికి చాలా ఒపాజిషన్ వున్నాయి. అన్నిటికన్నా ముందు ఆ అమ్మాయి ఎవరో తెలియాలి కదా”

5

టి.వి.లో లైవ్ ఇంటర్వ్యూ వస్తోంది.

ఆ రోజు డేవిస్ కప్ మ్యాచ్ గెలిచిన సందర్భంగా తెలుగువాడైన ప్రహసిత్‌ని హైదరాబాద్ దూరదర్శన్ ఇంటర్వ్యూ చేస్తోంది.

“ఓడిపోబోతున్న చివరిక్షణంలో గెలవడం మీకెలా అనిపించింది?”.

“నాకెందుకో ఈ రోజు గెలుస్తాననన్న నమ్మకం కలిగింది”.

“ఎలా?” ఇంటర్వ్యూ చేసే అమ్మాయి ఆశ్చర్యంగా అడిగింది.

“నిన్న సాయంత్రం నా దగ్గరికి ఒక సాధువు వచ్చాడు. నాకు శుభం కలుగుతుందని, దానికోసం పూజ ఒకటి చేయాలనీ చెప్పి, అయిదొందలు ఇమ్మన్నాడు. ఇటువంటి విషయాలమీద నమ్మకం లేని నేను అతడిని నిరాకరించాను. దాంతో అతడికి కోపం వచ్చి ‘ఈరోజు ఆటలో మానసికంగా ఓడిపోయే స్థితికి చేరుకుంటాననీ, అప్పుడు తనని తల్చుకొమ్మనీ’ అన్నాడు. తన మహత్తుమీద నమ్మకం కలిగితే, ముందు వరుసలో ఒక దేవి అంశ వున్న స్త్రీ కూర్చుని వుంటుందనీ, బంతిని ఆమె ఆకర్షించి తన శక్తిని దానికి ఆపాదిస్తుందని, అప్పటితో దశ తిరుగుతుందని అన్నాడు. అతని మాటలమీద నమ్మకం లేక నేను దాన్ని పట్టించుకోలేదు. కానీ అతడు చెప్పినట్టే జరగటం మొదలైంది. అంతలో ఒక ఆకుపచ్చ చీరె కట్టుకున్న ఆమె ముందు వరసలో కనపడింది. అప్పటివరకూ నేను ఆటలో గెల్చినా, మానసికంగా ఓడిపోతూ వచ్చాను. అప్పుడు బంతి వెళ్ళి ఆమె ఒళ్ళో పడింది”

ఇంట్లో టి.వి. చూస్తున్న లక్ష్మి ఉలిక్కిపడింది.

ప్రహసిత్ ఇంటర్వ్యూ కొనసాగించాడు" నాకు ఆ సాధువే ఈ రూపంలో అక్కడ కూర్చొని బంతి ద్వారా నన్ను ఆశీర్వదించినట్టు అనిపించింది. దాంతో పోయిన శక్తి తిరిగి పుంజుకున్నాను".

ఇంటర్వ్యూ చేసే అమ్మాయి నోరు తెరుచుకుని వింటోంది . ఆంధ్రదేశంలో చాలామంది కూడా....

"ఆ సాధువు తిరిగి కనపడ్డాడా?"

"లేదు. మ్యాచ్ అయిన తరువాత ఆ సాధువు నన్ను తిరిగి కలుసుకుంటాడేమో, అయిదొందల విషయంలో అపార్థం చేసుకున్నందుకు క్షమించమని అడుగుదామనుకున్నాను. కానీ కలుసుకోలేదు. ఆ సాధువు ఎక్కడున్నా ఈ దూరదర్శన్ ద్వారా ఆయనకి నా నమస్కారాలు అర్పిస్తున్నాను".

"మరి ఆమె...."

ప్రహసిత్ మొహంలో ఇంకా ఆ ఉద్వేగ భావం అలాగే వుంది. "ఆమె కూడా మాయమైపోయింది."

"ఏమిటీ?" ఇంటర్వ్యూ చేసే అమ్మాయి కంఠం కీచుమంది.

"అవును. మ్యాచ్ అయిపోగానే ఆమెని కలుసుకుందామనుకున్నాను. ఈ గెలుపుకి కారణం ఆమె. కానీ ఆమె లేదు. కుర్చీ ఖాళీగా వుంది".

"వెళ్ళిపోయిందేమో"

"లేదు. ఆమె రావటమే ఒంటరిగా వచ్చింది. నిశ్శబ్దంగా కూర్చుని మాయమైపోయింది".

"ఇదంతా నమ్మశక్యం కాకుండా ఉంది ప్రహసిత్‌గారూ"

ఈ వార్త తెలిసిన విలేకర్లు...ఈ సంచలన వార్త ప్రముఖంగా ప్రచురించటం కోసం సమాయత్తమవుతున్నారు.

ప్రహసిత్ అన్నాడు...“సాధారణంగా ఇలాంటి మ్యాచ్‌లు చూడటానికి వచ్చేవారు ప్రతి చిన్న షాట్‌కి, సెట్‌కి ప్రతిస్పందన చూపిస్తారు. కానీ ఆమె మొహంలో అటువంటిదేమీ లేదు. కనీసం చప్పట్లు కూడా కొట్టలేదు. కేవలం నన్ను గెలిపించటానికి వచ్చిన స్త్రీలా కనిపించింది. మరోలా చెప్పాలంటే ఆ సాధువు పంపిన శక్తి ‘అంశ’ లా...”

ఇంటర్వ్యూ మరో పది నిముషాలపాటు కొనసాగింది.

అది అయిపోయాక లక్ష్మి టి.వి. కట్టేసింది. ఆమెకి ఏ పనీ చేయబుద్ధి కాలేదు. కొంచెంసేపు హాల్లోనే అటూ ఇటూ తిరిగింది.

అతడు తనని ఎంత తప్పుగా అనుకున్నాడో, అది తల్చుకుంటూంటె ఆమెకి కాలు నిలవటం లేదు. అతడు గెలవడానికి కారణం కేవలం అతడిలోవున్న శక్తే. అంతే తప్ప...సాధువు పంపిన శక్తి కాదు. తను అంతకన్నా కాదు. తన ఒళ్ళో బాల్ పడటం కేవలం యాదృచ్ఛికం. ఈ విషయం అతనికి చెప్పాలి.

అతనికి ఫోన్ చెయ్యాలంటే ఆమెకి భయంవేసింది. అసలు ఫోన్ ఇస్తారో, ఇవ్వరో... ఎంతమంది సెక్రటరీలుంటారో అనుకుంది.

కొంచెంసేపు అయ్యాక ‘అతడేమనుకుంటే నాకేం?’ అనుకుని ఆ సంఘటన పూర్తిగా మర్చిపోయింది.

కానీ ప్రొద్దున్నే పేపర్లో ప్రముఖంగా, పెద్ద పెద్ద అక్షరాల్లో ‘ఆటగాడిని గెలిపించిన మహాశక్తి’ అని పడేసరికి, ఇక ఆపుకోలేక డైరక్టరీ వెతికి ఫోన్ చేసింది.

‘హాల్లో’ అట్నుంచి కంఠం చాలా హుందాగా వినిపించింది.
ఆమె ఒక క్షణం తటపటాయించి “.....ప్రహసిత్‌గారు వున్నారా?” అని అడిగింది.

“మీ పేరు?”

“ల...క్ష్మి”

అట్నుంచి రిసీవర్ పట్టుకున్న ప్రహసిత్ కుర్చీలో నిటారుగా అయ్యాడు.

ఆ క్షణం కోసం నిన్న సాయంత్రం నుంచీ ఎదురు చూస్తున్నాడు. ఏ ఫోన్ మ్రోగినా ఆమె దగ్గర్నుంచేమో అనుకున్నాడు. నిజానికి చాలా ఫోన్‌లు వొచ్చినయ్. కానీ ఆమె తన పేరు చెప్పగానే, తను నిన్నటినుంచి వెతుకుతున్నది ఈమెకోసమే అని అనిపించింది. అతని వూహ నిజమైంది.

“నిన్న రాత్రి టి.వి.లో మీ ఇంటర్వ్యూ చూశానండీ. మీరు అనుకున్నట్టు నేను ఏ శక్తిస్వరూపాన్నీ కాదు. అనవసరంగా అపోహ పడ్డారు. అది చెబుదామనే ఫోన్ చేశాను. వుంటానండీ” అని ఫోన్ పెట్టెయ్యబోయింది.

“ఆగండి”కంగారుగా అరిచాడు.

ఆ తరువాత ఏం మాట్లాడాలో తెలియలేదు. ఆమె అట్నుంచి ఫోన్ పట్టుకుని వేచివుందని తెలుసు.

“నేను...నేను ప్రహసిత్ సెక్రటరీని...” అన్నాడు “నిన్న మా బాస్ చెప్పింది నాకూ నచ్చలేదండీ. ఎవరో సాధువు ఏదో చెప్పటమేమిటి? మీ వొళ్ళో బంతి పడగానే మీది శక్తి స్వరూపం అనుకోవటం ఏమిటి?”.

“నేనూ అదే చెపుదామనుకున్నానండీ” అంది లక్ష్మి అమాయకంగా.

తను అనుకున్నదాన్ని బలపరిచే వ్యక్తి దొరకటంతో ఆమెకి ధైర్యం వచ్చింది“అయినా దూరదర్శన్‌లో అలాటివి చెపుతారటండీ. ఇంకేం పనిలేదా వాళ్ళకి” అంది.

“దూరదర్శన్‌కి అంతకన్నా మంచి పనులుంటాయని నేను అనుకోవటం లేదు లెండి” అన్నాడు అట్నుంచి ప్రహసిత్. “బాబాల పక్క ప్రధానమంత్రులు చిన్న కుర్చీల్లో కూర్చున్నా దాన్ని దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తారు వాళ్ళు. దానికన్నా ఇది మంచిపనే కదండీ. ఎవరో ముక్కూ, మొహం తెలియని అమ్మాయికి, ఈ టీవి ద్వారా

మా బాస్ సందేశం అందజేయగలిగాడంటే ...... దూరదర్శన్ తన జీవితకాలంలో చేసిన ఏకైక మంచిపని ఇదే అయి వుంటుంది".

ఆమె ఫోన్ పెట్టేయబోయింది.

"ఆగండాగండి" అన్నాడు. "ప్రహసిత్ గారితో మాట్లాడరా?"

"ఇక మాట్లాడేదేం వుందండీ? మీరీ విషయం ఆయనకి చెప్పండి".

"ఆయన మీతో మాట్లాడాలనుకుంటారేమో! మీ ఫోన్ నెంబర్ ఇవ్వండి".

"వద్దులెండి. చెప్పాలనుకున్నది చెప్పాగా".

ప్రహసిత్ బుర్ర పాదరసంలా పని చేసింది. "చూడండి. మీకు ఓ దురదృష్టకరమైన వార్త చెప్పాలి. ఇంకా ఎవరికీ తెలీదు. టి.వి ఇంటర్వ్యూ నుంచి వస్తూండగా ప్రహసిత్‌గారికి గుండెల్లో నొప్పి వచ్చింది. ప్రస్తుతం హాస్పిటల్‌లో వున్నారు".

"అయ్యో" అందామె విషాదంగా. ఆ కంఠంలో నిజాయితీ వీణానాదంలా వినిపించింది అతడికి.

కంఠంలో మరింత శోకాన్ని తెచ్చుకుంటూ... "ఆయన నిన్నటినుంచి మీ విషయమే ఆలోచిస్తున్నారు. బహుశా ఆయనకి గుండె అపరేషన్ జరగవచ్చు. ఆపరేషన్ అవగానే నేనీ విషయం చెబితే, ముందు మీతోనే మాట్లాడాలనుకోవచ్చు ఆయన. మీరు ఫోన్ నెంబర్ ఇవ్వలేదని చెప్తే ఆయనకి మళ్ళీ గుండె ఆపరేషన్ చేయవలసిరావొచ్చు. ఒక సెక్రటరీగా నేనది భరించలేను. ఆయన మీతో మాట్లాడేలా చేయవలసిన కర్తవ్యం నా మీద వుంది ప్లీజ్.. చెప్పండి..." అన్నాడు ఆవేదనగా అభ్యర్థిస్తున్నట్టు.

ఆమెకి ఏం చెయ్యాలో తోచలేదు. ఫోన్‌నెంబర్ చెప్పాలా వద్దా అవి సందిగ్ధంలో చూస్తున్నాడు.

ప్రహసిత్ ఇటువైపునుంచి...ఆమె చెప్పబోయే నెంబర్ కోసం ఊపిరి బిగపట్టి ఎదురు చూస్తున్నాడు.

ఆమె ఒక్క క్షణం ఆగి, నేను మళ్ళీ చేస్తాన్లెండి అని పెట్టేసింది. ప్రహసిత్ గాఢంగా నిశ్వసించాడు.

తను అప్పటివరకూ ఎవరికోసం ఎదురుచూశాడో, ఆ అమ్మాయి ఆచూకీ లభ్యమై, చివరిక్షణంలో తప్పిపోవటం  అతడికి భరించలేనంత నిరాశగా అనిపించింది.

ఇక అలాగే ఫోన్ వైపు చూస్తూ కూర్చున్నాడు. రేపటిలోగా ఆ అమ్మాయి చేస్తే సరేసరి. లేకపోతే ఇక చచ్చినా చెయ్యదు. రేపు పేపర్లో ఈ ఆపరేషన్ వార్త రాదు కాబట్టి, తను చెప్పింది అబద్ధమని తెలిసిపోతుంది.

## 6

రాత్రి పదకొండయింది.

విష్ణు ఇంకా రాలేదు. లక్ష్మి పక్కమీద పడుకుని పుస్తకం చదువుకుంటూ వుంది.